క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చాట్రాయి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో విజయలక్ష్మి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి ప్రజలు వస్తున్న నేపథ్యంలో వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం దోహదపడుతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపాల్టీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 5న నిర్వహించనున్న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే 'చలో విజయవాడ' కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. కొండపల్లి మున్సిపాల్టీ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సమ్మె కాలపు హామీల అమలు, కార్మికుల క్రమబద్ధీకరణ, ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల పెంపు వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. మున్సిపాల్టీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రెయిలింగ్ లేక ప్రమాదకరంగా వంతెన



జి.కొండూరు: స్థానిక పులివాగు వంతెనపై ఇనుప రెయిలింగ్ ప్రమాదకరంగా మారింది. గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు రెయిలింగ్ ఒక వైపు పూర్తిగా విరిగిపోగా మరో వైపు అక్కడక్కడా విరిగి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. వరదలొచ్చిపోయి ఆరు నెలలు గడిచినా రెయిలింగ్ ఏర్పాటుకు మాత్రం అధికారులు చొరవ చూపడంలేదు. జి.కొండూరు గ్రామం మధ్యలో ఉన్న ఈ వంతెన భారీ వాహనాలు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడం వల్ల రాత్రి సమయాలలో వాహనదారులు వాగులో పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రెయిలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బాల్య వివాహాలను సామాజిక బాధ్యతగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ కొండపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ జి.రమాదేవి అన్నారు. కొండపల్లి కుమ్మరివీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాలను అరికట్టేందుకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. బాల్య వివాహాల నిషేధచట్టం, దాని ప్రాముఖ్యత, బాలలపై లైంగిక వేధింపుల నివారణపై ఆమె అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయబోమ తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ జరిపారు. అంగన్‌వాడీ చిన్నారుల పేరుపై మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విస్సన్నపేట: మెదడు వాపు వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి విస్సన్నపేట వికాస్ స్కూలు విద్యార్థులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. 3వ తరగతి చదివే ఐశ్వర్య మెదడు వాపు వ్యాధికి గురికాగా పేద కుటుంబం కావడంతో వైద్య చికిత్సకోసం ఇబ్బంది పడుతున్నారు. వారి ఇబ్బందులు గమనించిన వికాస్ విద్యా సంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి సూచన మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.80 వేలు సేకరించి వైద్యఖర్చుల నిమిత్తం ఐశ్వర్య తల్లిదండ్రులకు అందజేశారు.

12 మంది బైండోవర్

ఆగిరిపల్లి: సింహాద్రి అప్పారావుపేటలో సోమవారం 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. గ్రామంలో అక్రమంగా సారా, మద్యం విక్రయిస్తున్న 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి డెప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్ ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా డీటీ పవన్‌కుమార్ మాట్లాడుతూ మళ్లీ నేరాలకు పాల్పడితే లక్ష జరిమానాతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఆరుతడి పంటలపై ఆసక్తి

- సమీపంలో సాగర్ కాలువ
- అయినా సకాలంలో సాగునీరు అందకపోవడమే కారణం
- ఆరుతడిలో మొక్కజొన్న సాగుకు డిమాండ్

మైలవరం: ఆరుతడి పంటలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. సమీపంలో సాగర్ కాలువ ఉన్నప్పటికీ సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాకపోవడంతో వారు ఆరుతడి పంటలపై మొగ్గు చూపుతున్నారు. దీనికి వ్యవసాయశాఖ అధికారులు కూడా రైతులకు సహకరిస్తున్నారు.

గతంలో దాళ్వా వరి..

ఈ ఏడాది మొక్కజొన్నను రికార్డు స్థాయిలో సాగు చేసిన రైతుల ఆశలకు జీవం పోస్తుండగా సంప్రదాయ సాగు విధానంలో సరికొత్త మార్పులు తీసుకువచ్చింది. మైలవరం నియోజకవర్గంలో రబీలో సాగర్ కాలువల అసరాతో ఎన్నో సంవత్సరాలుగా దాళ్వా వరి సాగు చేస్తున్నారు. సాగర్ నీరు అంతంత మాత్రంగా వస్తున్నా దాళ్వా పైనే రైతులు మక్కువ చూపించారు.

ఆరుతడిలో మొక్కజొన్నకు డిమాండ్..

పశువుల దాణా, కోళ్ల మేత తయారీలో మొక్కజొన్న వినియోగం, అదే విధంగా తినుబండారాల తయారీలోనూ ఉపయోగిస్తుండటంతో మొక్కజొన్నకు డిమాండ్ పెరిగింది. మొక్కజొన్న కంకులు తీసేసిన తరువాత పశువుల మేతకు ఖాళీబొండులను కూడా రైతులు ఉపయోగిస్తున్నారు. మొక్కజొన్నతో తయారు చేసిన దాణాను వినియోగించడం వలన పశువులకు, కోళ్లకు బలం చేకూరుతుంది. మొక్కజొన్న పౌడర్‌ను వంటల తయారీలో కూడా వినియోగిస్తారు.



మైలవరంలో మొక్కజొన్న పంట



మొక్కజొన్న కండెలు

నియోజకవర్గంలో ఇలా..

మైలవరం నియోజకవర్గంలో మొక్కజొన్న 5 వేల ఎకరాలు, వరి 3,200 ఎకరాలు, మినుము 150 ఎకరాలు, శనగలు 850 ఎకరాల్లో రైతులు పండిస్తున్నారు. వరికి మినహా ఈ పంటలకు ఎక్కువగా నీరు అవసరం లేదు. మొక్కజొన్న ఎకరానికి 35 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. దీంతో మెట్ట ప్రాంతం రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

గతంలో ప్రోత్సాహం..

సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు కొనుగోలు నుంచి ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు, కొనుగోళ్లు కూడా గ్రామాల్లోనే జరుగుతుండటంతో రైతులకు వెసులుబాటు కల్పించారు. దీనితో ఆర్బీకేలు రైతులకు వరంగా మారాయి.

మొక్కజొన్న సాగు బాగుంది



మొక్కజొన్న పంట మెట్ట ప్రాంతం రైతులు పండించే పంట. దీనికి ఎక్కువగా నీటి అవసరం కూడా ఉండదు. పెట్టుబడి తక్కువ, దిగుబడి కూడా బాగా వస్తుంది. పశువుల దాణా, కోళ్ల మేతకు డిమాండ్ బాగుంది. గిట్టుబాటు ధర బాగానే ఉంది. రవాణా ఖర్చులు కూడా తగ్గాయి.

– జే శ్రీనివాసరావు, రైతు, బొర్రగూడెం

వినికిడి లోపం రాకుండా జాగ్రత్తలు పాటించాలి



నూజివీడు ఏరియా ఆస్పత్రి వద్ద ప్రదర్శనలో సూపరింటెండెంట్ ఆర్ నరేంద్రసింగ్, వైద్యులు

నూజివీడు: వినికిడి లోపం రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ పేర్కొన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సోమవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రసింగ్ మాట్లాడుతూ చెవిలో నొప్పి, పోటు, సంభాషణలను అనుసరించలేకపోవడం, శబ్దాలను వినలేకపోవడం, టీవీలో సౌండ్‌ను పెంచి వినడం తదితరవన్నీ వినికిడి లోపానికి సంకేతాలన్నారు. అధిక ధ్వనితో కూడిన శబ్దాలు చేరి చెవిలోని సున్నిత అవయవాలకు నష్టం కలిగించడంతో విని కిడి క్షీణిస్తుందన్నారు. దీర్ఘకాలిక చెవి ఇన్ఫెక్షన్లు, చెవిలో గులిమి పేరుకుపోవడం తదితర కారణాల వల్ల కూడా వినికిడి లోపం ఏర్పడుతుందన్నారు. వినికిడి లోపానికి గురైనవారికి మెరుగైన చికిత్స, వినికిడి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఈ దినోత్సవం ముఖ్యఉద్దేశమన్నారు. శబ్దకాలుష్యం, ట్రాఫిక్ శబ్దం, ఇయర్‌ఫోన్ల అధిక వినియోగం, మొబైల్‌లో ఎక్కువసేపు పాటలు వినడం, తలకు గాయం, చెవి ఇన్ఫెక్షన్ లేదా ఏదైనా వ్యాధి, వంశ పారంపర్యత, తదితర కారణాల వల్ల వినికిడి లోపం రావొచ్చన్నారు. నేడు ఈ సమస్య నివారణకు ఆధునిక చికిత్సలు ఉన్నాయన్నారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలకు సైన్స్‌ఫెయిర్ దోహదం



సైన్స్ ఫెయిర్- 2025ను ప్రారంభిస్తున్న లక్కరాజు వంశీ తదితరులు

ఇబ్రహీంపట్నం: సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు, ఆవిష్కరణలు విద్యార్థుల్లో సృజనాత్మకత ఆలోచనలకు దోహద పడతాయని ఇండియన్ ఫిలింఫెస్టివల్ ఫౌండర్ లక్కరాజు వంశీ తెలిపారు. స్థానిక సెవెంత్ డే అడ్వంటిస్ట్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్- 2025 సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన సైన్స్‌ఫెయిర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి విద్యార్థులను సైన్స్ ఫెయిర్‌లో భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వివిధ ఆవిష్కరణలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జోన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డేనియల్ కుమార్, జి.మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ డెవిడ్ మార్క్, ప్రవాస భారతీయుడు ప్రసన్న కుమార్ స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'బలివే' ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు

ముసునూరు: మహాశివరాత్రి మహోత్సవాల ముగింపు అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సర్పంచ్ రావు ప్రవీణ, ఎంపీడీఓ జి.రాణి పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు శానిటేషన్ పనులు నిర్వహించారు. 200 మంది పారిశుద్ధ్య కార్మికులతో బలివే ఆలయ, ఉత్సవ ప్రాంగణం, తాత గుడి వీధి, గ్రామంలోని ప్రధాన వీధులు, సచివాలయం, పాఠశాల ఏరియాల్లో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని ఉత్సవ ప్రాంగణం, ఆలయానికి మూడు వైపులా ఉన్న రహదారులకు ఇరువైపులా రెండేసి కిలోమీటర్ల పొడవున ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లను తొలగించారు. చెత్తా చెదారాన్ని ట్రాక్టర్లకు ఎత్తించి, చెత్త శుద్ధి కేంద్రానికి తరలించారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ధర్మావతి, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, వీధులన్నింటా క్లోరినేషన్ చేయించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణ, దోమల వృద్ధిని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వైద్య, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

పైపులైన్ల పునరుద్ధరణ

చిట్టేల(తిరువూరురూరల్): మండలంలోని చిట్టేలలో ఇటీవల ధ్వంసమైన మంచినీటి పైపులైన్లను సోమవారం పునరుద్ధరించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు పలు ప్రాంతాలకు పైపులైన్లు విస్తరించారు. సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తేనె నరేంద్ర పర్యవేక్షించారు.

బాలోత్సవంలో మెరిసిన విద్యార్థినులు



ముసునూరు: విద్యలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, సాంస్కృతిక పోటీల్లోనూ తమ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారని ముసునూరు బాలికల గురుకులం ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ అన్నారు. నూజివీడులో ఆదివారం నిర్వహించిన బాలోత్సవంలో ఏడు విభాగాల్లో తమ విద్యార్థినులు బహుమతులు సాధించినట్లు సోమవారం ఆమె చెప్పారు. సీనియర్స్ విభాగం పెయింటింగ్‌లో ప్రథమ, కథా రచనలో ద్వితీయ, పద్యానికి భావం చెప్పడంలో తృతీయ, బృందగానంలో ద్వితీయ, క్విజ్ పోటీలో తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. జూనియర్స్ విభాగంలో స్పెల్ బీ తృతీయ, పాటల పోటీలో తృతీయ బహుమతులు సాధించినట్లు చెప్పారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంకుడు గుంతల లక్ష్యాలను పూర్తి చేయండి

డ్వామా పీడీ రాము



ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో నిర్దేశించిన పశువుల షెడ్లు, ఇంకుడు గుంతలు, ఫారమ్ పాండ్స్, కంపోస్ట్ పిట్స్ నిర్మాణ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని డ్వామా పీడీ రాము తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎంపీపీ కార్యాలయంలో నాలుగు మండలాల పరిధిలోని క్లస్టర్ లెవల్ అధికారులకు గ్రామాల్లో నిర్వహిస్తున్న పనులపై సోమవారం సమీక్ష జరిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్ తప్పనిసరిగా ఉండేలా ప్రోత్సహించాలని సూచించారు. ఏపీడీ జయ చంద్రగాంధీ, ఎంపీడీవో సునీతశర్మ, ఏపీవోలు ప్రమీళ, మాధవరెడ్డి, రమాదేవి, వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తిరువూరు: తిరువూరులో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తిరువూరులోని 4 పరీక్ష కేంద్రాల్లో 993 మందికి గాను 930 మంది హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10 మంది, శ్రీనిధి కాలేజీ సెంటర్లో ఆరుగురు, నాగార్జున కాలేజీలో ఐదుగురు, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇద్దరు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కళాశాల స్థాయిలో ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసం కలిగి ఉండాలని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కంద్రగుంట రామకృష్ణయ్య తెలిపారు. కేతనకొండ ఆర్కే కళాశాలలో ఏఐఎంఎల్, డీఎస్ విభాగాల ఆధ్వర్యంలో కెరీర్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కెరీర్‌లో ఎలా సక్సెస్ అవ్వాలి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రాముఖ్యత, ఇంటర్వ్యూ సమయాల్లో ఉండాల్సిన లక్షణాల గురించి విద్యార్థులకు వెల్లడించారు. పవర్‌ప్లే ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలు వివరించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. వివిధ విభాగాధిపతులు షేక్ షబాజ్, కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.సాయిరాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హెల్మెట్ ధరించడం తప్పనిసరి

మైలవరం: వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్‌లు ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు. మైలవరంలో నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్ అసోసియేషన్, మైలవరం పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ వాహనంపై బయలుదేరినప్పుడు ఇంటి వద్ద కుటుంబ సభ్యులు రాక కోసం ఎదురు చూస్తుంటారని గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలి

మైలవరం: విద్యార్థులు ఆర్థిక శాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు వీ నారాయణరావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు అధ్యక్షతన కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ షేక్ కరీముల్లా అతిథి ఉపన్యాసం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో పరిశ్రమలు స్థాపించడానికి ఈ అంశాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.శ్రీనివాసరావు, కే హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథి అధ్యాపకుడిని సన్మానించారు.

దుమ్ముతో ఇబ్బందులు



చాట్రాయి: ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు వినియోగించిన వెట్ మిక్సర్ కారణంగా రేగుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చనుబండలోని కొర్లమండ రోడ్డు, నరసింహారావుపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతుల కోసం నెల రోజుల క్రితం గుంతల్లో వేసిన వెట్ మిక్సర్ వాహనాల రాకపోకలతో బూడిదగా మారి దుమ్ము, ధూళి రేగుతోంది. రోడ్డు పక్కన ఉండే హోటళ్లలోని ఆహార పదార్థాలపై దుమ్ము పడుతుండడంతో తినలేకపోతున్నామని ప్రజలు తెలిపారు. అన్ని షాపుల్లోకి, గృహాల్లోకి విపరీతంగా దుమ్ము, ధూళి రావడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు, కాంట్రాక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మామిడి విక్రయాలు ప్రారంభం



రెడ్డిగూడెం మండలం మెట్టగూడెంలో మామిడి కాయలు

మైలవరం: మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెంలో మామిడి కాయల అమ్మకాలు ప్రారంభించారు. రెడ్డిగూడెం మండలంలో మెట్టగూడెం సెంటర్‌లో శనివారం రాత్రి వీరాంజనేయ మ్యాంగో మార్కెట్, దేవరకొండ ఆంజనేయ మ్యాంగో మార్కెట్‌లకు గుజరాత్, మహారాష్ట్ర, యూపీ రాష్ట్రాల నుంచి బయ్యర్‌లు వచ్చి వేలం ద్వారా మామిడి కొనుగోళ్లు ప్రారంభించారు. బంగినపల్లి మామిడి టన్ను రూ.70 వేల నుంచి రూ.1,25,000 వరకు ధర పలికింది. తోతాపురి మామిడి టన్ను రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు, రసాలు టన్ను రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ధర పలికిందని మామిడి వ్యాపారి దేవరకొండ ఆంజనేయులు తెలిపారు. కాగి కాయ దెబ్బ తినకుండా కాయలకు కవర్‌లు ఏర్పాటు చేసిన వాటికి నాణ్యతను బట్టి ధర మరింత ఎక్కువగా పలికింది. గతంలో అధిక దిగుబడులు ఉండటంతో రెడ్డిగూడెం నుంచి సుమారు 10 నుంచి 15 లారీల వరకు ఎగుమతి అయ్యేది. కానీ ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడం, దిగుబడి లేకపోవడంతో కేవలం 3, 4 లారీలకే పరిమితమైందని వ్యాపారులు తెలిపారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

జిల్లా పశు వైద్యాధికారి హనుమంతరావు



కొత్తూరులో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు వైద్యాధికారి ఎం.హనుమంతరావు

జి.కొండూరు: రైతులు పశువులకు గాలికుంటు టీకాలను తప్పక వేయించాలని ఎన్టీఆర్ జిల్లా పశు వైద్యాధికారి ఎం.హనుమంతరావు అన్నారు. జి.కొండూరు శివారు కొత్తూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. గాలికుంటు వ్యాధి వల్ల పశువులు జ్వరం భారిన పడి నీరసించి పాల ఉత్పత్తి పడిపోయి ఆర్థికంగా నష్టపోతారన్నారు. గాలికుంటు టీకాలను ముందస్తుగా వేయించడం వల్లన వ్యాధి నిరోధక శక్తి పెరిగి పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. టీకాలు వేయించడం వల్లన ఈ వ్యాధి భారిన పడి దూడలు మరణించకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు టీకాలను వైద్యాధికారులు ఇంటి వద్దకే వచ్చి వేస్తారని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. పశు వైద్యాధికారి ఎస్.శైలజ పాల్గొన్నారు.

సారాను దరిచేరనీయమని ప్రతిజ్ఞ



రేపూడిలోప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

తిరువూరు: నవోదయం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏకొండూరు మండలం రేపూడి తండా, గొల్లమందల గ్రామాల్లో సారా నిర్మూలిస్తామని గ్రామస్తులతో ఎక్సైజ్ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. సారాతో కలిగే అనర్థాలు ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణవేణి వివరించారు.

26 మద్యం సీసాలు స్వాధీనం

తిరువూరు ఎక్సైజ్ స్టేషను పరిధిలో పలు బెల్టు దుకాణాలపై అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. మండలంలోని ఆంజనేయ పురంలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న బొల్లెపోగు వెంకటరత్నం, బజ్జూరి శ్రీనివాసరావు, గుంజి వెంకటేశ్వరరావుల నుంచి 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఏకొండూరు మండలం రామచంద్రాపురంలో పంబి వెంకటేశ్వరరావు బెల్టు దుకాణం నుంచి 55 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



గంపలగూడెంలో విజేతలకు బహుమతులందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆగిరిపల్లిలో వ్యాసరచన పోటీలో విద్యార్థులు

తిరువూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం పోలీసులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'మహిళా సాధికారత సాధనలో యువత పాత్ర' అనే అంశంపై నిర్వహించిన పోటీలలో విజేతలకు ఎస్ఐ సత్యనారాయణ బహుమతులు అందజేశారు. మహిళలు, యువతులకు అమలులో ఉన్న చట్టాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు, ఏఎస్ఐ లక్ష్మి, ఉపాధ్యాయురాలు భరతకుమారి పాల్గొన్నారు.

చాట్రాయి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చాట్రాయి ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'మహిళల సాధికారిత, హక్కులు, సమానత్వం' అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. స్టేషన్ సిబ్బంది, హైస్కూలు హెచ్ఎం కాలసాని సూర్యనారాయణ పాల్గొన్నారు.

తిరువూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'లింగవివక్ష నిర్మూలనలో పురుషుల పాత్ర' అనే అంశంపై జరిగిన పోటీలలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతి ప్రదానం చేశారు.

ఆగిరిపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై శుభ శేఖర్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర, రక్షణపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



విస్సన్నపేట: హైదరాబాద్‌కు చెందిన బహుళజాతి ఔషధ సంస్థ జోడాస్ ఆధ్వర్యంలో సోమవారం విస్సన్నపేట వికాస్ కళాశాలలోప్రాంగణ ఎంపికలు జరిగాయి. 250 మంది విద్యార్థులు హాజరవగా 60 మంది ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు. జోడాస్ సంస్థ ప్రతినిధులు జగదీష్, శ్రీనివాసరావు, భరత్, వికాస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు శ్రీనివాసరావు, వెంకట్, తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులను అభినందించారు.

నూజివీడు: దివీస్ లేబొరేటరీస్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్, క్వాలిటీ ఎస్యూరెన్స్ విభాగాల్లో విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 180 మంది విద్యార్థులు పాల్గొనగా 75 మందిని పలు విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కంపెనీ సీనియర్ హెచ్ఆర్ రామకృష్ణ పాల్గొనగా, ఎంపికైన వారిని కళాశాల చైర్మన్ మేడా మోహన్‌రావు అభినందించారు.